RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:140 | మే 30, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్ 9701923260



## దుండ్రపల్లిలో మట్టి మాఫియా దందా!

రాత్రింబవళ్లు అక్రమ తవ్వకాలు, రవాణా

3లో



## సౌర గ్రామాల దిశగా తెలంగాణ ముందడుగు

- బోనకల్‌లో మోడల్ సోలార్ విలేజ్ ప్రారంభం
- ప్రతి ఇంటికి రెండు కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**వేద న్యూస్, ఖమ్మం**

తెలంగాణలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని విస్తృత స్థాయిలో పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా వేదికగా నిలిచింది. మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విస్తృతంగా పర్యటించి చిన్నబీరవల్లి గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ వ్యవస్థలను ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం

..మిగతా 2వ పేజీలో



## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం

- శాంతి చర్చల మధ్య పరస్పర ఆరోపణలు
- అమెరికా విమానం కూల్చివేశామన్న ఇరాన్
- ఆ వార్తలను ఖండించిన సెంట్‌కామ్
- హోర్ముజ్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు
- అణు చర్చల భవిష్యత్తుపై అనిశ్చితి

2లో



# అదృశ్యమవుతున్న కంటిపాపలు!

## కన్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కిడ్నాప్ ముఠాలు

### సమాజానికి ప్రమాద హెచ్చరిక

- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా పెరుగుతున్న అదృశ్య ఘటనలు
- పిల్లల మిస్సింగ్‌తో కన్నవారికి ఆవేదన
- మానవ అక్రమ రవాణా, బలవంతపు కార్మిక వ్యవస్థే ప్రధాన కారణం
- సామాజిక మాధ్యమాల ద్వారా పెరుగుతున్న ముప్పు
- చిన్నారులకు స్వీయ రక్షణకు అవగాహన అవసరం
- పిల్లల భద్రత సమాజం బాధ్యత

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

ప్రస్తుత సమాజంలో చిన్నారుల అదృశ్య ఘటనలు ప్రతి ఏటా విపరీతంగా పెరుగుతుండటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తూ, సామాజిక భద్రతకు పెద్ద ప్రమాద హెచ్చరికగా మారింది. ప్రమాదకరమైన కిడ్నాప్ ముఠాలు, మానవ అక్రమ రవాణా, బలవంతపు కార్మిక వ్యవస్థల కోసం చిన్నారులను లక్ష్యంగా చేసుకుంటుండగా, మరోవైపు సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ మోసాల ద్వారా కూడా ముప్పు పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ కంటిపాపలు ఆచూకీ లేకుండా పోవడంతో తల్లిదండ్రులు తీరని మానసిక వేదనను అనుభవిస్తూ సజీవ నరకాన్ని చూస్తున్నారు. ఆధునిక సాంకేతికత, సీసీ కెమెరాలు, ప్రత్యేక హెల్ప్‌లైన్ల ద్వారా పోలీసులు అన్వేషణను వేగవంతం చేస్తున్నప్పటికీ, పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, పాఠశాలలు నిరంతరం అలర్ట్‌గా ఉండటం అత్యవసరం. అపరిచితుల పట్ల ఎలా వ్యవహరించాలో చిన్నారులకు చిన్నతనం నుంచే స్వీయ రక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి బిడ్డ సురక్షితంగా జీవించే వాతావరణాన్ని నిర్మించాల్సిన బాధ్యత యావత్ సమాజంపై ఎంతైనా ఉంది.



## సీఎం సర్ మీరే దిక్కు..

### డీజీపీ గారూ న్యాయం చేయాలి

- 8 ఏళ్లయినా దక్కని న్యాయం..?
- విషప్రయోగం అని ఫోరెన్సిక్ రిపోర్టు
- 'న్యాచురల్ డెత్'గా మార్చేసిన పోలీసులు
- హెచ్‌ఆర్‌సీ యాక్షన్ తీసుకోమన్నా పట్టింపులేని ఖాకీలు
- సీఎం ప్రజావాణిలో బాధితుడి ఫిర్యాదు

2లో

## భగీరథ్ కు ముగిసిన మూడ్రోజుల పోలీసు కస్టడీ



**వేద న్యూస్, హైదరాబాద్**

మైనర్ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలతో నమోదైన పోక్సో కేసులో అరెస్టైన భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆయనను మూడు రోజుల పాటు తమ

..మిగతా 2వ పేజీలో

## రైతు డిస్కమ్.. వద్దే వద్దు

- రైతాంగ భవిష్యత్తుతో ముడిపడిన కీలక అంశం
- 33 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి
- అసెంబ్లీ, రైతు సంఘాలతో చర్చించాలి
- డిస్కమ్‌ల బకాయిలే ఆర్థిక సమస్యలకు కారణం
- విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది
- ఉద్యోగుల కొరతతో సేవలపై ప్రభావం పడే అవకాశం
- పైలట్ ప్రాజెక్టు తర్వాతే నిర్ణయం తీసుకోవాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్, హైదరాబాద్**

రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రతిపాదన తెలంగాణ రైతాంగ భవిష్యత్తును ప్రభావితం చేసే అత్యంత కీలక అంశమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఈఆర్‌సీని కోరిన కవిత, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అంశాన్ని పరిమిత స్థాయిలో చర్చించడం

..మిగతా 2వ పేజీలో



## కాజీపేట రైల్వే యూనిట్‌కు ఊపు



### రూ.521 కోట్లతో భారీ తయారీ కేంద్రం

- 95 శాతం పూర్తైన నిర్మాణ పనులు
- తుది దశలో వర్క్‌షాప్, పెయింట్‌షాప్ నిర్మాణం
- రైల్వే కోచ్‌ల తయారీకి కీలక కేంద్రంగా కాజీపేట
- స్థానిక యువతకు భారీ ఉపాధి అవకాశాలు
- అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి కొత్త దారి
- తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత బలం
- దేశ రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో కీలక ప్రాజెక్టు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

తెలంగాణలోని కాజీపేటలో నిర్మాణంలో ఉన్న రైల్వే తయారీ యూనిట్ దేశ రైల్వే రంగానికి కీలక కేంద్రంగా మారబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు భారత రైల్వే రోలింగ్ స్టాక్ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపును అందించనుందని పేర్కొన్నారు. రూ.521.36 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రైల్వే తయారీ యూనిట్ పనులు

..మిగతా 2వ పేజీలో




## తెలంగాణలో 'టీజీ' వాహన కోడ్‌లు అమల్లోకి..

జిల్లాల వారీగా కొత్త రిజిస్ట్రేషన్ నంబర్ల కేటాయింపు

2లో

వేద న్యూస్

శనివారం | మే 30, 2026

## సౌర గ్రామాల దిశగా ముందడుగు

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్వావలంబన సాధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగం పెరగడం ద్వారా విద్యుత్ వ్యయం తగ్గడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి విడతగా 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి రెండు కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థలు, వ్యవసాయ మోటార్లకు 7.5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర ప్యానెల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు రూ.1,380 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఖమ్మం జిల్లాకు ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లాలో 27 గ్రామాలను ఎంపిక చేసి రూ.445 కోట్ల వ్యయంతో 16,837 గృహాలకు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో పనులు పురోగతిలో ఉండగా, త్వరలోనే పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సౌర విద్యుత్ ద్వారా గృహ అవసరాలను తీర్చుకోవడంతో పాటు అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. రైతులు కూడా సౌర విద్యుత్ ఆధారిత మోటార్లను వినియోగించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ హిత అభివృద్ధి, స్వచ్ఛ ఇంధన వినియోగం, గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధి లక్ష్యాలతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సౌర విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు ఈ పథకాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

## రైతు డిస్కమ్.. వద్దే వద్దు

**మొదటి పేజీ తరువాయి**

సరికాదన్నారు. తెలంగాణలో రైతులు 29 లక్షల బోర్లు ఏర్పాటు చేసుకున్నారని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యుత్ రంగంలో పెట్టుబడుల వల్ల వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. రైతు డిస్కమ్ నిజంగా రైతులకు మేలు చేసేదైతే ప్రభుత్వం దానిని రహస్యంగా ఎందుకు ఉంచిందని ప్రశ్నించారు. అసెంబ్లీలో చర్చించకుండా, రైతు సంఘాలతో సంప్రదించకుండా ముందుకు తీసుకెళ్లడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికే డిస్కమ్‌లకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆర్థిక సమస్యలకు అదే ప్రధాన కారణమని పేర్కొన్నారు. కొత్త డిస్కమ్ ఏర్పాటు కంటే ప్రస్తుత వ్యవస్థను బలోపేతం చేయడం మంచిదని అభిప్రాయపడ్డారు. తక్కువ సిబ్బందితో లక్షలాది వ్యవసాయ కనెక్షన్ల నిర్వహణ కష్టసాధ్యమవుతుందని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, నిర్వహణ పనులు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతు డిస్కమ్ అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, ముందుగా పైలట్ ప్రాజెక్టు అమలు చేసి ఫలితాలను పరిశీలించిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈఆర్‌సీ ప్రతిపాదనను తిరస్కరించాలని, ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని కవిత కోరారు.

## కాజీపేట రైల్వే యూనిట్‌కు ఊపు

**మొదటి పేజీ తరువాయి**

ప్రస్తుతం 95 శాతం పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ప్రారంభమైతే దేశ రైల్వే అవసరాలకు మరింత సమర్థవంతమైన తయారీ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రధాన వర్క్‌షాప్, పరీక్షా కేంద్రం, పెయింట్ షాప్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని వెల్లడించారు. అలాగే పరిపాలనా భవనాలు, అంతర్గత రైల్వే ట్రాక్‌లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్ ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కలగడంతో పాటు అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి కూడా ఇది దోహదపడనుంది. దీంతో వరంగల్ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా మరింత బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రైల్వే కోచ్‌లు, ఇతర రోలింగ్ స్టాక్ తయారీ, మరమ్మతు కార్యకలాపాలకు కాజీపేట కీలక కేంద్రంగా మారనుంది. దేశ రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో ఈ యూనిట్ ముఖ్యపాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న ప్రధాన రైల్వే ప్రాజెక్టుల్లో కాజీపేట రైల్వే తయారీ యూనిట్ ఒకటిగా నిలుస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవుతున్న ఈ యూనిట్ ద్వారా రైల్వే రంగంలో ఉత్పాదకత పెరగడంతో పాటు నిర్వహణ సామర్థ్యం కూడా మెరుగుపడనుంది. పనులు పూర్తయి ప్రారంభమైతే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక రంగ విస్తరణకు, ఉపాధి కల్పనకు ఇది మరింత బలం చేకూర్చనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన కేంద్రాల్లో కాజీపేట ఒకటిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

## భగీరథ్ కు ముగిసిన కస్టడీ

**మొదటి పేజీ తరువాయి**


కస్టడీలో ఉంచి విచారించారు. కస్టడీ గడువు పూర్తికావడంతో భగీరథ్‌ను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయనను చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో భగీరథ్‌ను పలు కోణాల్లో ప్రశ్నించినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పరిస్థితులు, ఆరోపణలు, సంఘటనల క్రమంపై వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రత్యేకంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా సీన్ రీకన్స్ట్రక్షన్ నిర్వహించేందుకు భగీరథ్‌ను మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ జరిగినట్లు ఆరోపణలు ఉన్న సంఘటనలపై ఆధారాలు, పరిస్థితులను పరిశీలిస్తూ పోలీసులు విచారణ కొనసాగించారు. కేసులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, గత ఏడాది డిసెంబర్ 31న తన కుమార్తెను భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.

# సీఎం సర్ మీరే దిక్కు.. డీజీపీ గారూ న్యాయం చేయాలి

- 8 ఏళ్లయినా దక్కని న్యాయం..?
- విషప్రయోగం అని ఫోరెన్సిక్ రిపోర్టు
- 'న్యాచురల్ డెత్'గా మార్చేసిన పోలీసులు
- హెచ్‌ఆర్‌సీ యాక్షన్ తీసుకోమన్నా పట్టింపులేని ఖాకీలు
- సీఎం ప్రజావాణిలో బాధితుడి ఫిర్యాదు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**





న్యాయం చేయాల్సిన అధికారులే నిందితులకు కొమ్ముకాస్తూ పోలీస్ శాఖ గౌరవాన్ని కొంత మంది పోలీసులు దిగజారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 09 మే 2018 నాడు భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఆషాడపు దశరథం-లక్ష్మి దంపతుల కుమారుడు ఆషాడపు రాజేష్ (20) మిత్రుడి పెళ్లి బారాత్ లో డ్యాన్స్ చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు అకాల మరణం వెనుక అనుమానాలు ఉన్నాయంటూ తండ్రి దశరథం స్థానిక వంగర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రాథమికంగా పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి స్నేహితులైన తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఫోరెన్సిక్ (ఎఫ్ఎస్ఎల్) ల్యాబ్ నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. రాజేష్ తాగిన బీరులో విషం ఉన్నట్లు, అది విషప్రయోగం వల్ల జరిగిన హత్యేనని ఫోరెన్సిక్ నివేదికలు తేల్చిచెప్పాయి. అయితే, ఇంత బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా తీవ్ర ఉదాసీనత ప్రదర్శించారని మృతుడి తండ్రి దశరథం ఆరోపిస్తున్నారు. కొడుకును కోల్పోయిన ఆ కన్నతల్లిదండ్రులు న్యాయం కోసం ఎక్కని మెట్లు, తిరగని ఆఫీసులు లేవు. ఈ సుదీర్ఘ పోరాటంలో న్యాయం దక్కకపోగా, వారిపై భారీగా ఆర్థిక భారం పడింది.

**అప్పటి సీపీ ఫైల్ రీఓపెన్ చేసినా..**

మధ్యలో 2023లో వరంగల్ సీపీగా ఉన్న రంగనాథ్ స్పందించి ఈ ఫైల్‌ను రీఓపెన్ చేయించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రగతి కనిపించలేదు. మానవ హక్కుల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా, ప్రజావాణిలో పదే పదే మొరపెట్టుకున్నా బాధితులకు చుక్కెదురే అయింది. దానికి పరాకాష్టగా, గత ఏప్రిల్ 8న వంగర ఎస్ హెచ్ఓ నుంచి బాధితులకు ఒక పోస్ట్ అందింది. అందులో రాజేష్ ది 'న్యాచురల్ డెత్' అని పేర్కొనడంతో ఆ తల్లిదండ్రులు ఖంగుతిన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు విషప్రయోగం అని చెప్తుంటే, పోలీసులు దాన్ని సహజ మరణంగా ఎలా కొట్టేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

**సీఎం సర్ మీరే దిక్కు.. డీజీపీ గారూ న్యాయం చేయాలి**

ఈ క్రమంలోనే, తమకు జరిగిన ఘోర అన్యాయాన్ని వివరిస్తూ శుక్రవారం సీఎం ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. ఈ కేసుపై సిట్టింగ్ జడ్జితో లేదా ఉన్నత స్థాయి అధికారులతో లోతైన విచారణ జరిపించి, నిందితులను శిక్షించాలని, అలాగే కేసును పక్కదారి పట్టించిన పోలీసు అధికారుల ప్రమేయంపై కూడా విచారణ జరపాలని వారు వేడుకుంటున్నారు. ఎనిమిదేళ్లుగా న్యాయం కోసం అల్లాడుతున్న ఆ దంపతుల ఆఖరి ఆశ ఇప్పుడు సీఎం, డీజీపీ సర్ పైనే ఉంది. అసలు రాజేష్ ది పోలీసులు చెబుతున్నట్లు సహజ మరణమా? లేక ఫోరెన్సిక్ రిపోర్టు చెప్తున్నట్లు విషప్రయోగ హత్యనా? అనేది తేల్చాల్సిన బాధ్యత పోలీస్ ఉన్నతాధికారులపై ఎంతైనా ఉంది.

# అదృశ్యమవుతున్న కంటిపాపలు!

**కన్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కిడ్నాప్ ముఠాలు**

- సమాజానికి ప్రమాద హెచ్చరిక
- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా పెరుగుతున్న అదృశ్య ఘటనలు
- పిల్లల మిస్సింగ్ తో కన్నవారికి ఆవేదన
- మానవ అక్రమ రవాణా, బలవంతపు కార్మిక వ్యవస్థే ప్రధాన కారణం
- సామాజిక మాధ్యమాల ద్వారా పెరుగుతున్న ముప్పు
- చిన్నారులకు స్వీయ రక్షణకు అవగాహన అవసరం
- పిల్లల భద్రత సమాజం బాధ్యత

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



ప్రస్తుత సమాజంలో చిన్నారుల అదృశ్య ఘటనలు ప్రతి ఏటా విపరీతంగా పెరుగుతుండటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చిన్నారుల రక్షణలో కేవలం కుటుంబాలే కాకుండా, ప్రభుత్వాలు, యావత్ సమాజం కలిసికట్టుగా పని చేయాల్సిన అత్యవసర పరిస్థితిని ఈ రోజు మనకు గుర్తుచేస్తోంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రతి ఏడాది వేలాది మంది చిన్నారులు ఆచూకీ లేకుండా పోతున్నారని అంతర్జాతీయ రక్షణ సంస్థలు వెల్లడిస్తున్నాయి. కొంతమంది పిల్లలు కుటుంబ సమస్యలు, ఒత్తిడి తట్టుకోలేక ఇళ్ల నుంచి వెళ్లిపోతుండగా.. మరికొందరు ప్రమాదకరమైన కిడ్నాప్ ముఠాలు, మానవ అక్రమ రవాణా వంటి ఘోరమైన నేరాల బారిన పడుతున్నారు. చిన్నారులను అక్రమ పనులు, బలవంతపు కార్మిక వ్యవస్థలు మరియు వివిధ రకాల నేర కార్యకలాపాల కోసం ముఠాలు ఉపయోగించుకుంటున్న వైనం వెలుగులోకి వస్తోంది. వీటికి తోడు సామాజిక మాధ్యమాల ద్వారా అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం, ఆన్‌లైన్ మోసాలకు గురికావడం కూడా పిల్లల అదృశ్యానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కుటుంబాల్లో తీరని వేదన..**

ఒక చిన్నారి కనిపించకుండా పోవడం అనేది ఆయా కుటుంబాలకు జీవితాంతం కోలుకోలేని మానసిక వేదనను మిగులుస్తోంది. తమ కంటి పాపల కోసం పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవా సంస్థల చుట్టూ తిరుగుతూ తల్లిదండ్రులు గడిపే రోజులు వర్ణనాతీతం. దర్యాప్తులో కొంతమంది పిల్లలు సురక్షితంగా తిరిగి దొరికినప్పటికీ, మరికొందరి ఆచూకీ సంవత్సరాల తరబడి తెలియకపోవడం కన్నవారిని సజీవ నరకంలోకి నెడుతోంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ తరహా నేరాలను అరికట్టేందుకు చట్టాలను మరింత కఠినతరం చేస్తున్నారు.

**సాంకేతికతతో ముమ్మర అన్వేషణ..**

ఇటీవలి కాలంలో ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో చిన్నారుల అన్వేషణ ప్రక్రియ వేగవంతమవుతోంది. నగరాల్లోని సీసీ కెమెరాల నెట్‌వర్క్, మొబైల్ ట్రాకింగ్ మరియు ముఖ గుర్తింపు వ్యవస్థల సహాయంతో పోలీసులు అనేక సంక్లిష్టమైన కేసులను ఛేదిస్తున్నారు. పలు దేశాల్లో అదృశ్యమైన చిన్నారుల కోసం ప్రత్యేక అత్యవసర హెల్ప్‌లైన్లను సైతం ఏర్పాటు చేశారు. ఏదైనా చిన్నారి అదృశ్యమైనట్లు సమాచారం అందిన వెంటనే పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు మరియు మీడియా యంత్రాంగం కలిసి ఉమ్మడిగా అన్వేషణ ప్రారంభించే ప్రత్యేక విధానాలు ఇప్పుడు అమలులోకి రావడం వల్ల చాలామంది పిల్లలను వేగంగా రక్షించే అవకాశం కలుగుతోంది.

**తల్లిదండ్రులు, పాఠశాలలు అలర్ట్..**

పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దని, వారు ఇచ్చే వస్తువులను తీసుకోకూడదని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇంటి చిరునామా, తల్లిదండ్రుల అత్యవసర ఫోన్ నంబర్లు పిల్లలకు గుర్తుండేలా చేయాలి. ముఖ్యంగా ఇంటర్నెట్, ఆన్‌లైన్ గేమింగ్‌లలో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని చిన్నారులకు అవగాహన కల్పించాలి. పాఠశాలలు కూడా కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పిల్లలకు స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ప్రతి చిన్నారి సురక్షితంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం సమాజం మొత్తం బాధ్యత అని ఈ దినోత్సవం చాటిచెబుతోంది.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

శాంతి చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు సాగుతుండగా, మరోవైపు ఇరుదేశాలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇటీవల ఇరాన్‌కు చెందిన డ్రోన్లను అమెరికా బలగాలు అడ్డుకుని ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించింది. హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని సైనిక లక్ష్యాలపై పరిమిత స్థాయిలో రక్షణాత్మక చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ మీడియా బుషెర్ ప్రావిన్స్‌లో అమెరికాకు చెందిన ఓ విమానాన్ని తమ దళాలు కూల్చివేశాయని ప్రకటించింది. అయితే విమానం రకం, సిబ్బంది పరిస్థితిపై స్పష్టత ఇవ్వలేదు. ఇరాన్ ఆరోపణలను అమెరికా సెంట్‌కామ్ పూర్తిగా ఖండించింది. తమకు చెందిన ఎలాంటి యుద్ధ విమానం లేదా డ్రోన్ కూల్చివేయబడలేదని, అన్ని వైమానిక ఆస్తులు సురక్షితంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. ఇరాన్ అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి భద్రత, ఆంక్షల ఎత్తివేత వంటి అంశాలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. విమానం కూల్చివేతపై స్వతంత్ర ధృవీకరణ ఇంకా వెలువడకపోగా, మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

## తెలంగాణలో 'టీజీ' వాహన కోడ్‌లు అమల్లోకి!




**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్‌లో గతంలో అమలులో ఉన్న 'టీఎస్' కోడ్ స్థానంలో 'టీజీ' కోడ్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర రవాణా శాఖ జిల్లాల వారీగా కొత్త రిజిస్ట్రేషన్ కోడ్‌లను కేటాయించింది. ఇకపై రాష్ట్రంలో కొనుగోలు చేసే కొత్త వాహనాలకు 'టీజీ' సిరీస్‌తో రిజిస్ట్రేషన్ నంబర్లు జారీ చేయనున్నారు. జిల్లాల పునర్విభజన, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా మొత్తం 36 రవాణా కార్యాలయాలకు కొత్త కోడ్‌లు కేటాయించారు. కరీంనగర్‌కు టీజీ-02, రాజన్న సిరిసిల్లకు టీజీ-23, జగిత్యాలకు టీజీ-21, సిద్దిపేటకు టీజీ-36, జోగులాంబ గద్వాలకు టీజీ-33, వికారాబాద్‌కు టీజీ-34 కోడ్‌లు కేటాయించబడ్డాయి. అలాగే హైదరాబాద్ పరిధిలోని వివిధ జోన్లకు టీజీ-09 నుంచి టీజీ-14 వరకు కోడ్‌లు అమల్లో ఉంటాయి. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఈ కోడ్‌లనే ఉపయోగించనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. వాహనదారులు ఈ మార్పును గమనించి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

వేద న్యూస్

శనివారం మే 30, 2026

## ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్ ఉద్యోగాలు

- నెలకు రూ.1.99 లక్షలకుపైగా వేతనం
- టామ్‌కామ్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్‌లో వృద్ధుల సంరక్షణ కోసం కేర్‌గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.99 లక్షలకుపైగా వేతనం లభించనుంది. 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎంఫీహెచ్‌డబ్ల్యూ, ఎంఫీహెచ్‌ఏ లేదా పేషెంట్ కేర్ డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం రెండేళ్ల అనుభవం ఉండటంతో పాటు ఇంగ్లిష్ మాట్లాడగల సామర్థ్యం అవసరమని అధికారులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను టామ్‌కామ్‌కు పంపాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసగాళ్లను నమ్మవద్దని, ప్రభుత్వ సంస్థ టామ్‌కామ్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## విచారణ పూర్తయ్యే వరకు రిలీవింగ్ నిలిపివేయాలి

- మద్దునూర్ పంచాయతీ కార్యదర్శిపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, జగిత్యాల జిల్లా:**



మద్దునూర్ గ్రామపంచాయతీలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్థిక అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మేకల అక్షయ్ కుమార్ శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజాగౌడ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్లనున్న మద్దునూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గత ఆరేళ్లుగా అక్కడే విధులు నిర్వహించారని, ఆ కాలంలో గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో పలు అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ రికార్డులు, రిజిస్టర్లు పోగొట్టడంతో పాటు వివిధ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికే చేసిన పలు ఫిర్యాదులు విచారణలోనే పెండింగ్‌లో ఉన్నాయని, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత కార్యదర్శికి రిలీవింగ్ ఇవ్వవద్దని అదనపు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మద్దునూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలను త్వరితగతిన విచారించి, బదిలీ రిలీవింగ్ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## వరి కొయ్యకాళ్లు కాల్చొద్దు..

- భూమిలో కలిపితే నేలకు మేలు - వ్యవసాయ అధికారులు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్, నర్సింగాపూర్, తడగొండ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. వరి కొయ్యకాళ్లను కాల్చకుండా రోటావేటర్‌తో భూమిలో కలియదున్నాలని అధికారులు సూచించారు. వరి కొయ్యకాళ్లు మురగడం వల్ల నేలకు సేంద్రియ కార్బన్ అందుతుందని, కాల్చడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. మంటలు వ్యాపించి పశువులు, రైతులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే జీలుగు పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి భూమిలో కలియదున్నితే నేల సారం పెరగడంతో పాటు యూరియా వినియోగం తగ్గుతుందని తెలిపారు. వానాకాలంలో సన్నరకాల వరి సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీదేవి, రజిత, రవళి రైతులకు సూచించారు.

## మైనింగ్ కోర్సు ప్రారంభించాలి

- సీఎంకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

**వేద న్యూస్, హైదరాబాద్:**

హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును ప్రవేశపెట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అధికారిక లేఖ రాశారు. దేశ విదేశాల్లో మైనింగ్ ఇంజనీర్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా సింగరేణి గనుల ప్రాంతమైన ఉత్తర తెలంగాణలో ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో పరిమిత అవకాశాలు ఉండటం, ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు కారణంగా పేద విద్యార్థులు ఈ కోర్సుకు దూరమవుతున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతం బొగ్గు గనుల బెల్ట్‌కు సమీపంలో ఉండటంతో మైనింగ్ కోర్సు ప్రారంభిస్తే విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమల అనుసంధానం సులభమవుతుందని వివరించారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచే బి.టెక్ మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సుకు అనుమతి ఇవ్వడంతో పాటు అవసరమైన అధ్యాపక, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.

## ఐకేపీ వీవోఏల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి


**వేద న్యూస్, కోటగిరి:**



మండల కేంద్రంలో ఐకేపీ వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు వీవోఏలకు సంఘీభావం ప్రకటిస్తూ తమ మద్దతు తెలిపారు. వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, పని భారం తగ్గించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 58 జీవోను సవరించడంతో పాటు రూ.20 లక్షల వరకు సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపి వివోఏలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి.. మహానేత..

- దేశబోయిన వెంకట్ రాములు
- ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన కాంగ్రెస్ యోధుడు
- ఆయన సేవలు చిరస్మరణీయం



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

ప్రజల కోసం జీవించి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకులు అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన నాయకుల్లో ఆమనగల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత దేశబోయిన వెంకట్ రాములు ఒకరు. రాజకీయాలను అధికార సాధనంగా కాకుండా ప్రజాసేవకు వేదికగా భావించి జీవితాంతం పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారు. 1949 డిసెంబర్ 25న శాంతమ్మ, వెంకటయ్య దంపతులకు జన్మించిన వెంకట్ రాములు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు కనబరిచారు. పేదల సమస్యలను తన సమస్యలుగా భావించి వారికి అండగా నిలిచారు. 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ స్వయంగా ఆయనకు రాఖీ కట్టడం ఆయనకు లభించిన అరుదైన గౌరవంగా నిలిచింది. 1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 1983లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1989లో జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్‌గా సేవలందించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సభల నిర్వహణలోనూ కీలక పాత్ర పోషించారు. రాజకీయాలతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. ఆమనగల్లు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా 11 సంవత్సరాలు సేవలందించి ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. పేదలకు భూముల పంపిణీ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను జీవిత సిద్ధాంతంగా స్వీకరించిన వెంకట్ రాములు కుల, మత భేదాలు లేకుండా అందరినీ సమానంగా గౌరవించారు. ప్రజలకు అవసరమైనప్పుడు అండగా నిలిచి సేవలందించారు. 2026 మే 22న ఆయన కన్నుమూసినా, ఆయన సేవలు, ఆశయాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ప్రస్తుతం ఆయన వారసత్వాన్ని కుమారుడు దేశబోయిన రవికుమార్ ప్రజాసేవ ద్వారా ముందుకు తీసుకెళ్తున్నారు. వెంకట్ రాములు చూపిన మార్గం నేటికీ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

## దుండ్రపల్లిలో మట్టి మాఫియా దందా!

- రాత్రింబవళ్లు అక్రమ తవ్వకాలు
- అనుమతులు లేకుండానే మట్టి తరలింపు
- అధికారుల మౌనంపై గ్రామస్తుల ఆగ్రహం



**వేద న్యూస్, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దుండ్రపల్లి గ్రామంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నారని విమర్శిస్తున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో జేసీబీలు, లారీలు, ట్రాక్టర్లతో నిరంతరం మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడంతో పాటు గ్రామీణ రహదారులు కూడా దెబ్బతింటున్నాయని తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియాతో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.



## వీవోఏల నిరవధిక దీక్షకు బీజేపీ సంఘీభావం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న వివోఏల నిరవధిక నిరాహార దీక్షకు భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరుశురామ్ నాయకత్వంలో బీజేపీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎడపల్లి పరుశురామ్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న వివోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ నిరవధిక దీక్ష పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. వివోఏల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నరసింహాచారి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, పసికంటి వెంకటేశం, యువమోర్చా మండల అధ్యక్షుడు మిరియాల శరత్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వివోఏలు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మే 30, 2026

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



**వేద న్యూస్, తంగళ్లపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.

**- తడిసిన ధాన్యం సేకరణకు ప్రత్యేక చర్యలు**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

ఇప్పటివరకు జిల్లాలో 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, మొత్తం సేకరణలో 80 శాతం పూర్తైనట్లు తెలిపారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు రెండేళ్ల జైలు

**- ప్రధానోపాధ్యాయుడి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌కు శిక్ష**

**- రూ.వెయ్యి జరిమానా విధించిన ధర్మపురి కోర్టు**

**వేద న్యూస్, జగిత్యాల:**

అతివేగం, నిర్లక్ష్యంగా స్కూల్ బస్సు నడిపి ఓ ప్రధానోపాధ్యాయుడి మృతికి కారణమైన కేసులో నిందితుడైన బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి యేగి జానకి తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్గటూరు మండలానికి చెందిన ఆవుల సంపత్ (51) బుగ్గారం మండలం బీరుసాని గ్రామ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2017 ఆగస్టు 29న ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా జగిత్యాల-ధర్మపురి రహదారిపై స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంపత్ చికిత్స పొందుతూ 2017 సెప్టెంబర్ 6న మృతి చెందారు. ఈ ఘటనపై బుగ్గారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో వెల్గటూరు మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన శాఖాపురం లచ్చయ్యను కోర్టు దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది.

# విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



**- రూ.80 వేల నష్టం**

జిల్లా కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా విద్యుదాఘాతానికి గురై ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటనలో రైతుకు సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది. సిరిసిల్ల పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గడ్డం రాజు జీవనోపాధి కోసం పాడి గేదెను పెంచుకుంటున్నాడు. గురువారం మేత కోసం గేదెను సిరిసిల్ల డ్యామ్ కరకట్ట ప్రాంతానికి తీసుకెళ్లగా, ఈదురుగాలుల ధాటికి ఓ విద్యుత్ స్తంభం కూలి గేదెపై పడింది. స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్ల ద్వారా కరెంట్ ప్రవహించడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. తన జీవనాధారమైన పాడి గేదెను కోల్పోయానని, ప్రభుత్వం మరియు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందించాలని రైతు గడ్డం రాజు కోరాడు. ఘటనపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యుత్ స్తంభాల నిర్వహణలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, బాధిత రైతుకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

**- అధ్యాపకులు మ్యాదరి రాకేష్**



**వేద న్యూస్, కోరుట్ల:**

యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో స్వయం ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యాపకులు మ్యాదరి రాకేష్ మాట్లాడుతూ, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన, పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్, పుట్టగొడుగుల పెంపకం, జూట్ బ్యాగుల తయారీ, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, మొబైల్ రిపేరింగ్, ఏసీ-ఫ్రిజ్ రిపేరింగ్, ఫోటో-వీడియో గ్రఫీ, హౌస్ వైరింగ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, శిక్షణా సామగ్రి అందజేస్తారని, కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకు రుణాల కోసం సహకారం అందిస్తామని తెలిపారు. జగిత్యాల జిల్లా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధ్యావనపల్లి రామకృష్ణ, ఉప సర్పంచ్ వనపర్తి సౌమ్య, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**- కలెక్టర్లతో వీసీలో ప్రధాన ఎన్నికల అధికారి**



**వేద న్యూస్, జగిత్యాల:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, తుది ఓటరు జాబితా రూపొందించే ముందు ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, మార్పులపై వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని తెలిపారు. అలాగే ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు.

# ఉపాధి హామీ పనులపై కలెక్టర్ సంతృప్తి

**- కూలీలకు కల్పిస్తున్న వసతులపై ప్రశంసలు**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. మండలంలోనే అత్యధికంగా సుమారు 480 మంది కూలీలు హాజరవుతుండటం, వారికి తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పనివేళలు, రోజువారీ పనుల లక్ష్యాలు, ఫోటో క్యాప్చరింగ్ విధానం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అనంతరం కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువు కంటే ముందే పనులను వేగంగా పూర్తి చేస్తున్న అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దార్, మండల అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలు తగలబెడితే కఠిన చర్యలు

**- ప్రాణనష్టం జరిగితే నాన్ బెయిలబుల్ కేసులు - ఎస్సై అశోక్**




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

పంట వ్యర్థాలను పొలాల్లో తగలబెట్టే రైతులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లంతకుంట ఎస్సై అశోక్ హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల సారం తగ్గిపోవడంతో పాటు పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. జీవో నెంబర్ 27 ప్రకారం పంట వ్యర్థాలను తగలబెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని, మంటల కారణంగా ఇతర రైతుల పంటలు, విద్యుత్ మోటార్లు, పైపులైన్లు దగ్ధమైతే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రాణనష్టం జరిగే ఘటనల్లో నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల తాళ్లపల్లి గ్రామ శివారులో గడ్డికి నిప్పు పెట్టడంతో రైతు ఎలుక నారాయణ మృతి చెందిన ఘటనతో పాటు, అనంతారం పరిధిలో సుమారు 300 ఎకరాల పంట దగ్ధమైన సంఘటనలను గుర్తు చేశారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని ఎస్సై అశోక్ సూచించారు.

# ధర్మపురి పరిశుభ్రతే లక్ష్యం

**- మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి**

**- చింతామణి చెరువు కట్టపై పారిశుధ్య పనుల పరిశీలన**

**వేద న్యూస్, ధర్మపురి:**



ధర్మపురి పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం చింతామణి చెరువు కట్టపై జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ అధికారి మహేష్, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రతినిధులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గౌరవ వేతనం కాదు.. జీవించే వేతనం కావాలి

**- కనీస వేతనం కోసం వివోఏల సమ్మె**



**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో వివోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. "గౌరవ వేతనం వద్దు.. కనీస వేతనం ఇవ్వాలి" అనే నినాదంతో తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపట్టారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ తగిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని వివోఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుతున్న గౌరవ వేతనం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొన్న వివోఏలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి సుమలత, జ్యోత్స్న, రాధ, విజయ, దేవలక్ష్మి, ప్రియాంక, హరిత, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మే 30 , 2026

# సమాజసేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- సామాజిక బాధ్యతతో జిల్లాను అభివృద్ధి చేద్దాం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వేద న్యూస్, హనుమకొండ:**

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వ్యాపారవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు పి.ఎన్. మూర్తి, మహేందర్ కపూర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి ఓ ముఖ్య సామాజిక సమస్యపై చర్చించారు. కిరాయి ఇళ్లలో నివసించే కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే, మృతదేహాన్ని ఇంట్లో ఉంచేందుకు ఇల్లు యజమానులు అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా పద్మాక్షమ్మ గుడి సమీపంలోని స్మశానవాటిక వద్ద స్థలం కేటాయిస్తే, ఉచితంగా భవనం నిర్మించి నిర్వహణ బాధ్యతలు కూడా చేపడతామని వ్యాపారవేత్తలు ముందుకు వచ్చారు. ఈ ప్రతిపాదనను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందిస్తూ, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ అంశంపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ఇది ప్రజలకు ఉపయోగపడే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, త్వరలోనే స్థలం గుర్తించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ అనితా రెడ్డి, పి.ఎన్. మూర్తి, మహేందర్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.

# వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



- ధర్నా శిబిరంలో బీఆర్ఎస్ నేత కట్టా మల్లేష్ గౌడ్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలో వివోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. వేములపల్లి మండల కేంద్రంలో వివోఏలు చేపట్టిన 12వ రోజు ధర్నా కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో వివోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాంటి వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు. వివోఏలకు రూ.20 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రూ.20 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేసి సీఆర్పీ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు ఇవ్వడంతో పాటు జీఓ నెం.58ను సవరించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు కొనసాగిస్తుందని కట్టా మల్లేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ పెద్దపంగ సైదులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాట్రగడ్డ రాజగోపాల్ రావు, తంగళ్ల సైదిరెడ్డి, వివోఏల మండల అధ్యక్షురాలు సువార్త, కార్యదర్శి రాణి, కోశాధికారి రూపతో పాటు పలువురు వివోఏలు పాల్గొన్నారు.

# యువ న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**వేద న్యూస్, హైదరాబాద్ :**




- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి

యువ న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి సూచించారు. స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ) 'పి.ఆర్ ఫౌండేషన్ ఫర్ సొసైటీ వెల్‌నెస్ అండ్ ఎంపవర్‌మెంట్' వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది పోనంపల్లి రవి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మూడురోజుల వర్క్‌షాప్‌లో రెండో రోజు కూడా కొనసాగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి హాజరై ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా యువ, జూనియర్ న్యాయవాదులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. డ్రాఫ్టింగ్, రెవెన్యూ, సివిల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, న్యాయవాదుల బాధ్యత, కోర్టులో రాణించే మెళుకువలు సహా పలు అంశాలపై మాట్లాడారు. యువ న్యాయవాదులకు పలు విలువైన సూచనలు చేశారు. వేసవిలో ఇలాంటి వర్క్‌షాప్ నిర్వహించినందుకు ఎన్జీఓను జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు జూనియర్, యువ న్యాయవాదులు పాల్గొని, వక్తలు చెప్పిన విషయాలను ఆసక్తిగా విన్నారు. వర్క్‌షాప్ మూడోరోజైన శనివారం కూడా కొనసాగనుందని ఎన్జీఓ ప్రతినిధులు తెలిపారు.

# ధాన్యం దింపడంలో జాప్యం చేయొద్దు




- ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్
- రైస్ మిల్లుల సందర్శన

**వేద న్యూస్, చొప్పదండి:**

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు చొప్పదండి మండలంలోని రైస్ మిల్లులను ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్ శుక్రవారం సందర్శించారు. ధాన్యం సరఫరా చేసే లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి, కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి అనవసరంగా తరుగు, కోతలు విధించవద్దని స్పష్టం చేశారు. రైతులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం తూకం, తేమ శాతం నిర్ధారణలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్ భరోసా ఇచ్చారు.

# గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు భారీ స్పందన

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**వేద న్యూస్, హైదరాబాద్:**

రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న 19,740 సీట్లకు గాను ఫేజ్-1లోనే 18,401 సీట్లు (93.21 శాతం) భర్తీ అయ్యాయని వెల్లడించారు. మే 15న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో అధిక శాతం సీట్లు భర్తీ కావడం గురుకులాలపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ఫేజ్-1లో ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూన్ 7లోపు సంబంధిత కళాశాలల్లో చేరాలని, జూన్ 1 నుంచే తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి సూచించారు. జాతీయ స్థాయిలో గురుకులాలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని, జేఈఈ మెయిన్‌లో వందలాది మంది విద్యార్థులు అర్హత సాధించారని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

- వీవోఏల దీక్షకు లింగాల సందీప్ సంఘీభావం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న వివోఏల నిరసన దీక్షకు బీఆర్ఎస్ యువ నాయకుడు లింగాల సందీప్, స్వేరో కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లింగాల సందీప్ మాట్లాడు తూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వివోఏలకు కనీస వేతనం, బీమా సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివోఏలకు రూ.20 వేల కనీస వేతనం, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా అందించడంతో పాటు ఎస్ఈఆర్పీ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని, జీవో 58ను సవరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సాగుతున్న దీక్షలకే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్ గౌడ్, యువ నాయకులు పంతులూరి సన్నీ, గడ్డమీది సాయిచందు, గుర్రాల రాజశేఖర్, పెండ్యాల బాలకిషన్, కొర్రి ప్రణయ్, పాశం ప్రశాంత్, బండి హరికృష్ణ, తోకల నవీన్, బడే మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్ రాములు మరణం బాధాకరం

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ రఘువీర్ రెడ్డి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశబోయిన వెంకట్ రాములు (77) మృతి పట్ల పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నివాసానికి చేరుకుని వెంకట్ రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌తో కలిసి మాట్లాడిన రఘువీర్ రెడ్డి, ప్రజల కోసం జీవితాంతం సేవ చేసిన నాయకుడు వెంకట్ రాములు అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలికాంత రెడ్డి, సర్పంచ్ పిల్లల సందీప్, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కెనాల్ బ్రిడ్జ్ సైడ్‌వాల్‌ను పునరుద్ధరించాలి

- అధికారులు స్పందించాలని బీజేవైఎం డిమాండ్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి-ధర్మారం రాష్ట్ర రహదారిపై మర్లవాడ వద్ద ఉన్న ఎస్ఆర్ఎస్పీ కెనాల్ బ్రిడ్జ్ రక్షణ గోడ కూలిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని బీజేవైఎం జిల్లా నాయకుడు సంగ నరేష్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జ్ సైడ్‌వాల్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ విషయమై ఆయన సంబంధిత ఏఈఈ నరేష్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. నిత్యం వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై రక్షణ గోడ దెబ్బతినడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగిందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఏఈఈ నరేష్, సమస్యను త్వరలోనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంగ నరేష్ తెలిపారు.

# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే..

- సైనికుల్లా పని చేయండి
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**వేద న్యూస్, చొప్పదండి:**

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించామని, వారు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. రామగుండం నియోజకవర్గ డిజిటల్ సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ రెడ్డి శుక్రవారం కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీని మరింత పటిష్టం చేసి, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతను సవాల్‌గా స్వీకరిస్తున్నానని రవీందర్ రెడ్డి తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. త్వరలో ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలను కలిసి డిజిటల్ సభ్యత్వ నమోదును వేగవంతం చేసి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసేలా పనిచేస్తానని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి :**

వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించి, కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాముగర్లతో కలిసి రైస్ మిల్లర్లు, కాంట్రాక్టర్లు, మండల ఏపీఎంలు (డీఆర్డీఏ), నోడల్ అధికారులు (డీసీఓ)లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ఓపీఎంఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు సూచనలు చేశారు. జిల్లాలో ఎక్కడా గన్ని సంచుల కొరత, రవాణా వాహనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమారాణిలు, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్ బాబు, డీఎంసీఎస్ సంధ్యారాణి, డీసీఎస్ఓ, కిష్టయ్య, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి సంబంధిత అధికారులు బొల్లికుంట పిపిసి కెంటర్ ను తనిఖీ చేశారు. పీపీసీలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను రేపటిలోగా మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

# శ్మశానవాటికను కాపాడాలి

- ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ అంబేద్కర్ నగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సర్వే నంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమి, స్మశాన వాటిక స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి గోడలు, గేట్లు నిర్మించుకున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గతంలో కాలనీవాసులు స్మశాన వాటికకు వెళ్లేందుకు ఉపయోగించిన దారిని కూడా మూసివేసి గేట్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శ్మశాన వాటికకు వెళ్లే మార్గం లేక అంబేద్కర్ నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 53లోని భూమిని పూర్తిస్థాయిలో కొలిపించి, కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో లబ్ధిదారుల అవస్థలు

- సరిపోని హాలులో వందలాది లబ్ధిదారులు
- విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు
- నిర్వహణపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి



**వేద న్యూస్, పాపన్నపేట:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం పాపన్నపేటలో అవస్థలకు నిలయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సరిపోని గదిలో అధిక సంఖ్యలో లబ్ధిదారులను కూర్చోబెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా చెక్కులు అందుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు ఒకరిపై ఒకరు పడే పరిస్థితి నెలకొంది. చిన్న సమావేశ మందిరంలో వంద మందికి పైగా లబ్ధిదారులను సమీకరించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొందరు ప్రజాప్రతినిధులు, మహిళలు హాలులో చోటు లేక బయటే నిలబడాల్సి వచ్చింది. కార్యక్రమం జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా పలుమార్లు నిలిచిపోవడంతో చీకట్లోనే కార్యక్రమాన్ని కొనసాగించాల్సి వచ్చింది. కరెంట్ అంతరాయంతో లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు ప్రణాళిక లేకుండా అధిక సంఖ్యలో ప్రజలను పిలవడం, తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ బ్యాకప్ వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్ నిర్వహణ తీరుపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

# పంట వ్యర్థాలను తగలబెట్టొద్దు

- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన పంట వ్యర్థాలను తగలబెట్టవద్దని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గడంతో పాటు వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కంపోస్టు ఎరువుగా, పశువుల మేతగా, బయోగ్యాస్ తయారీకి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే పొలంలోనే మల్చింగ్ చేయడం ద్వారా నేలలో తేమ నిల్వ ఉండి పంటలకు మేలు జరుగుతుందని వివరించారు. పంట అవశేషాల నిర్వహణకు అవసరమైన యంత్రాలపై ప్రభుత్వం 50 నుంచి 80 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. పంట వ్యర్థాలను తగలబెట్టిన రైతులపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. పంట వ్యర్థాలు చెత్త కాదని, రైతులకు అదనపు ఆదాయం అందించే వనరులని అధికారులు పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని భూసారాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

# అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త

- సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసుల అవగాహన



**వేద న్యూస్, కోటగిరి:**

కోటగిరి మండల కేంద్రంలోని కోటగల్లి వద్ద శుక్రవారం పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, అనుమానాస్పద లింకులు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా ఓటీపీ అడిగినా చెప్పవద్దని, తెలియని లింకులను క్లిక్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మోసపోయే ప్రమాదం ఉందని వివరించారు. ముఖ్యంగా పిల్లలు మొబైల్ ఫోన్లు ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంతోష్, సుధాకర్ పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్ల నిర్వహణ?

- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి - ఏఐవైఎఫ్ నేత యుగేందర్

**వేద న్యూస్, కరీంనగర్:**




కరీంనగర్‌లోని ర్యాంక్ ఫోర్డ్ అకాడమీ, గ్రావిటీ అకాడమీలు నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే ఇంటర్, ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో అడ్మిషన్లు చేపడుతున్నారని అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ఇంటర్ బోర్డు అనుమతి లేకుండానే ఇంటర్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. తప్పుడు ఫలితాలు, ప్రచారాలతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కనిపించలేదని అన్నారు. సంబంధిత కోచింగ్ సెంటర్లపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కదలని ధాన్యం కుప్పలు..

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు



**వేద న్యూస్, రామడుగు:**

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో కాంటా ఎప్పుడు పెడతారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. మండలంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం తరలింపు మందగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు లక్షా 60 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, మరో 40 వేల క్వింటాళ్లు కేంద్రాల్లోనే ఉన్నట్లు సమాచారం. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందేమోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాల్సిన సమయంలో ఇంకా ధాన్యం విక్రయాల కోసం తిరగాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కొనుగోళ్లలో కొందరికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మ్యాచ్యూరిటీ వచ్చినప్పటికీ తన ధాన్యాన్ని పక్కనపెట్టి ఇతరులకు అవకాశం కల్పించారని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు నాగి శేఖర్ డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# వడదెబ్బతో వృద్ధురాలు మృతి



**వేద న్యూస్,హనుమకొండ :**

తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన హనుమకొండ బస్టాండ్ 7వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జనగాని అమృత(76) లక్ష్మీపురం కు చెందిన నివాసి గురువారం సాయంత్రం పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతికి లోనయ్యారు. వడదెబ్బ తగిలి మృతి చెందిన వృద్ధురాలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు

వేద న్యూస్



# నిరుపేదలు, మధ్యతరగతికి సొంతింటి వరం

- లక్ష సరసమైన ఇళ్ల నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్
- తొలి విడతగా 12 వేల ఫ్లాట్ల పైలట్ ప్రాజెక్ట్
- ఎల్ఐజీ లబ్ధిదారులకు రూ.5 లక్షల సబ్సిడీ
- గృహనిర్మాణ శాఖ ఉత్తర్వులు జారీ

**వేద న్యూస్, హైదరాబాద్:**

రాష్ట్రంలోని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో లక్ష సరసమైన గృహాల నిర్మాణానికి సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 70 వేల ఎల్ఐజీ, 30 వేల ఎంఐజీ ఫ్లాట్లను నిర్మించనున్నారు. తొలి విడతలో భాగంగా 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్‌కు అనుమతులు మంజూరయ్యాయి. ఎల్ఐజీ వర్గాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. ప్రతి ఫ్లాట్‌పై రూ.5 లక్షల సబ్సిడీతో పాటు భూమి వ్యయాన్ని కూడా లబ్ధిదారులపై మోపకుండా ప్రభుత్వం భరిస్తుంది. ఈ ప్రాజెక్టును తెలంగాణ హౌసింగ్ బోర్డు సొంత వనరులతో అమలు చేయనుండగా, కేంద్ర ప్రభుత్వ పీఎంఏవై-యు 2.0 మార్గదర్శకాల ప్రకారం గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రాజెక్టు అమలుకు సంబంధించిన గైడ్‌లైన్లు, డిమాండ్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

# ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి
- కలెక్టర్ దివాకర టీఎస్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన డేటా నమోదు, పారదర్శకత, ఖచ్చితత్వంతో పని చేయాలని అన్నారు. మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. జూన్ 24 నుంచి జూలై 25 వరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్లు, బదిలీ అయిన ఓటర్ల వివరాలను సరిచూడాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురిస్తామని, అనంతరం వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

# అమరుల త్యాగాలను మరువం

- ప్రభుత్వం అండగా నిలుస్తుంది
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- మోత్కూర్‌లో మహిళా కమిషన్ సభ్యులకు ఆత్మీయ సన్మానం
- శంకరమ్మ, శ్వేతలకు అభినందనలు తెలిపిన మంత్రి



**వేద న్యూస్, నల్గొండ/మోత్కూర్:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను ఎప్పటికీ మరువబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అనేక మంది యువకులు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. తొలి దశ ఉద్యమంలో చాకలి అయిలమ్మ, మలిదశ ఉద్యమంలో అమరుడు శ్రీకాంతాచారి చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పలువురికి ప్రభుత్వం గుర్తింపు, గౌరవం కల్పిస్తోందన్నారు. అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను, చాకలి అయిలమ్మ వారసురాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యులుగా నియమించడం ద్వారా వారి సేవలకు ప్రభుత్వం గౌరవం తెలిపిందని అన్నారు. మహిళా కమిషన్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వారు రాష్ట్ర మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని మంత్రి పిలుపునిచ్చారు.

# సెన్సస్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- జూన్ తొమ్మిదిలోగా పూర్తి
- భూభారతి దరఖాస్తుల పరిష్కారం
- రేషన్ దుకాణాలపై నిఘా




**వేద న్యూస్ గద్వాల :**

సెన్సస్2027లో భాగంగా ఈ ఏడాది చేపట్టిన ఇంటింటి గణన కార్యక్రమాన్ని జూన్ 9వ తేదీలోగా పూర్తి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. సెన్సస్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో సుమారు 2.18 లక్షల ఇళ్లు ఉండగా ఇప్పటివరకు ఎన్యూమరేటర్లు దాదాపు 1.79 లక్షల ఇళ్ల గణన పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన గణన ప్రక్రియను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చార్జ్ అధికారులుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్లు తమ పరిధిలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం 95 శాతానికి పైగా హౌస్ లిస్ట్ ఆపరేషన్ పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో గణన ప్రక్రియ సక్రమంగా కొనసాగుతున్నదీ లేదీ పరిశీలించాలని సూచించారు. గణనలో ఎలాంటి లోపాలు, జాప్యాలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. సేకరించే సమాచారం ఖచ్చితత్వంతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పిన పంత్



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఘోరంగా విఫలమైన లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. రికార్డు స్థాయి రూ.27 కోట్లకు తనను కొనుగోలు చేసిన ఫ్రాంచైజీకి న్యాయం చేయలేకపోయాననే భావనతో కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని యాజమాన్యాన్ని కోరాడు. పంత్ అభ్యర్థనను లక్నో యాజమాన్యం వెంటనే అంగీకరించింది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. వరుసగా రెండు సీజన్లలో జట్టును ప్లే ఆఫ్స్‌కు తీసుకెళ్లడంలో విఫలమైన పంత్, ఈసారి జట్టు పరాజయాలకు పూర్తి బాధ్యత వహిస్తూ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం ఈ విషయాన్ని జట్టు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ టామ్ మూడీకి తెలియజేయగా, అతడు కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం. "తనను కెప్టెన్ పదవి నుంచి తప్పించాలని రిషభ్ పంత్ ఫ్రాంచైజీని అభ్యర్థించాడు. అతడి నిర్ణయాన్ని మేము గౌరవిస్తున్నాం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత సులభం కాదు. జట్టుకు కెప్టెన్‌గా అతడు అందించిన సేవలకు ధన్యవాదాలు. భవిష్యత్తులో మరింత బలంగా తిరిగి రావడానికి ప్రయత్నిస్తాం" అని లక్నో ఫ్రాంచైజీ వెల్లడించింది.

# వైభవ్‌పై గవాస్కర్ సంచలన వ్యాఖ్యలు




**వేద న్యూస్ డెస్క్:**

కేవలం పదిహేనేళ్ల వయసులోనే ప్రపంచ స్థాయి బౌలర్లను వణికిస్తున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న వైభవ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో పరుగుల తుఫాన్ సృష్టిస్తున్నాడు. ముఖ్యంగా హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. పాట్ కమిన్స్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్ కూడా ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగినా అతడిని అడ్డుకోలేకపోయానని ఒప్పుకోవడం వైభవ్ ప్రతిభకు నిదర్శనంగా మారింది. ఇప్పటికే ఒకే సీజన్‌లో 65 సిక్సర్లు బాది క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును కూడా అతడు బద్దలు కొట్టాడు. ఈ నేపథ్యంలో వైభవ్‌ను త్వరలోనే భారత జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్పందించిన సునీల్ గవాస్కర్, జూలైలో ఇంగ్లాండ్ పర్యటనలో జరిగే టీ20 సిరీస్ ద్వారానే వైభవ్ భారత జట్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# ముంబైని వీడనున్న హార్దిక్?



**వేద న్యూస్ డెస్క్:**

ఒకప్పుడు ముంబై ఇండియన్స్‌కు కీలక ఆటగాడిగా ఎన్నో విజయాలు అందించిన హార్దిక్ పాండ్యా, కెప్టెన్‌గా మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. వరుసగా మూడు సీజన్లలో జట్టు నిరాశజనక ప్రదర్శన చేయడంతో అభిమానులు, యాజమాన్యం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20ల్లో భారత జట్టును విజయవంతంగా నడిపించిన పాండ్యా, ఐపీఎల్‌లో మాత్రం ముంబైకి టైటిల్ అందించలేకపోయాడు. ఈ నేపథ్యంలో వచ్చే సీజన్‌కు ముందు అతడు జట్టును వీడే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన పూర్తిగా నిరాశపరిచింది. స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో విఫలమవ్వడం, ప్రధాన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఆశించిన స్థాయిలో వికెట్లు తీయకపోవడం జట్టుకు భారీ దెబ్బతీసింది. జట్టు వైఫల్యం సమిష్టిగానే కనిపించినప్పటికీ, ప్రధాన బాధ్యత కెప్టెన్ హార్దిక్‌పైనే పడింది. సీజన్ చివర్లో టాస్‌లకు సూర్యకుమార్ యాదవ్, బుమ్రా రావడం కూడా జట్టులో నాయకత్వంపై అనేక అనుమానాలకు తావిచ్చింది.

# సెమీస్‌లోకి సాత్విక్-చిరాగ్ జోడి




**వేద న్యూస్ డెస్క్:**

సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు శుక్రవారం మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయి రాజ్ చిరాగ్ శెట్టి అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా, మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సాత్విక్ చిరాగ్ జోడీ టైటిల్ వేటను విజయవంతంగా కొనసాగిస్తోంది. క్వార్టర్ ఫైనల్లో మలేషియాకు చెందిన కాంగ్ ఖాయ్ గ్జింగ్ అరోన్ తాయ్ జంటను ఉత్కంఠభరిత పోరులో ఓడించింది. తొలి సెట్‌ను 19-21తో చేజార్చుకున్న భారత జోడీ, రెండో సెట్‌లో పట్టుదలతో ఆడి 21-17తో గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది. అనంతరం నిర్ణయాత్మక మూడో సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సాత్విక్ చిరాగ్ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టారు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధుకు ప్రపంచ నంబర్ వన్ అన్ సె యాంగ్ గట్టి షాక్ ఇచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన యాంగ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సింధు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తొలి సెట్‌లో పోరాటపటిమ చూపించినప్పటికీ 17-21తో ఓడిపోయింది. రెండో సెట్‌లోనూ యాంగ్ దూకుడుకు ఎదురులేక 14-21తో పరాజయం పాలైంది. దీంతో సింధు టోర్నీకి వీడ్కోలు పలకగా, అన్ సె యాంగ్ సెమీస్‌కు అర్హత సాధించింది.

# ఐపీఎల్‌లో స్మార్ట్ గ్లాసెస్‌పై బీసీసీఐ కఠిన నిషేధం




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో అవినీతిని అరికట్టేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టెక్నాలజీ ఆధారిత అక్రమాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో, మ్యాచ్‌ల సమయంలో ఆటగాళ్లు మరియు మ్యాచ్ అధికారులపై 'స్మార్ట్ సన్ గ్లాసెస్' వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. బీసీసీఐ యాంటీ కరప్షన్ యూనిట్ జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం, ఈ స్మార్ట్ గ్లాసెస్‌లో లైవ్ స్ట్రీమింగ్, వీడియో కాలింగ్, టెక్స్ట్ మెసేజ్‌లు పంపే సదుపాయాలు ఉండటంతో అవి మ్యాచ్ సమగ్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని పేర్కొంది. మొబైల్ డేటా లేదా వైఫై ఆధారంగా పనిచేసే ఈ పరికరాలను కమ్యూనికేషన్ మరియు ఆడియో-వీడియో రికార్డింగ్ పరికరాల కింద వర్గీకరించినట్లు స్పష్టం చేసింది. మ్యాచ్ రోజుల్లో ప్లేయర్స్ అండ్ మ్యాచ్ అఫీషియల్స్ ఏరియాలో ఈ గ్లాసెస్‌ను ఉపయోగించరాదని, ఆటగాళ్లు తమ మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లతో పాటు వీటిని కూడా భద్రతా సిబ్బందికి తప్పనిసరిగా అప్పగించాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించింది. ఇటీవల రాజస్థాన్ జట్టు మేనేజర్ డగౌట్‌లో ఫోన్ వాడిన ఘటన వివాదాస్పదంగా మారడంతో బీసీసీఐ మరింత అప్రమత్తమైంది. ఇప్పటికే ఆటగాళ్ల హోటల్ గదుల్లోకి అతిథుల ప్రవేశంపై ఆంక్షలు, రాత్రి వేళల్లో అనుమతి లేకుండా బయటకు వెళ్లడంపై నిషేధం అమల్లో ఉండగా, తాజా ఆదేశాలతో ఐపీఎల్‌లో క్రమశిక్షణ, పారదర్శకతపై బీసీసీఐ ఎంతటి ప్రాధాన్యం ఇస్తోందో మరోసారి స్పష్టమైంది.

వేద న్యూస్

శనివారం మే 30 , 2026

# 'సిగ్మా' విడుదల తేదీ ఖరారు

**వేద న్యూస్ డెస్క్:**




తమిళ సినీ పరిశ్రమలో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా మారిన 'సిగ్మా' సినిమా విడుదల తేదీ అధికారికంగా ఖరారైంది. తమిళనాడు రాజకీయ నాయకుడు, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న తొలి చిత్రం కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. టాలీవుడ్ యువ హీరో సందీప్ కిషన్, నటి ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌ను జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. సుబాస్కరన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. ప్రముఖ ఎడిటర్ ప్రవీణ్ కె.ఎల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాంకేతికంగా కూడా సినిమా అత్యున్నత స్థాయిలో రూపొందుతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. 'మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే చోట వెతుక్కోవడం.. దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వస్తుంది?' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని సమాచారం. మైండ్ గేమ్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా రూపొందుతోందని తెలుస్తోంది. కథలో ట్విస్టులు, భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయని చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. జాసన్ సంజయ్ విదేశాల్లో ఫిల్మ్ మేకింగ్, స్క్రీన్ రైటింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన విషయం తెలిసిందే. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ పూర్తి చేసిన ఆయన.. లండన్‌లో స్క్రీన్ రైటింగ్‌లో కూడా శిక్షణ తీసుకున్నారు. తన తండ్రి విజయ్ స్టార్ ఇమేజ్‌ను పక్కనబెట్టి.. పూర్తిగా వైవిధ్యమైన కథాంశంతో దర్శకుడిగా ఎంట్రీ ఇవ్వడం సినీ పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించాయి. ముఖ్యంగా టీజర్‌లో కనిపించిన డార్క్ యాక్షన్ టోన్, థ్రిల్లింగ్ విజువల్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. సందీప్ కిషన్ కూడా ఈ చిత్రంలో ఇప్పటివరకు చేయని భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో కూడా సినిమాను ప్రమోట్ చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉండగా.. త్వరలోనే ట్రైలర్ విడుదలకు మేకర్స్ సిద్ధమవుతున్నారు జాసన్ సంజయ్ తొలి ప్రయత్నం ఎలా ఉండబోతోందో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొనగా.. 'సిగ్మా' విడుదల తర్వాత ఆయన దర్శకుడిగా ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటారో చూడాలని సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# 'దృశ్యం-3'పై మిక్స్‌డ్ టాక్..





**వేద న్యూస్ డెస్క్:**

భారతీయ సినీ పరిశ్రమలో ఫ్రాంఛైజీ సినిమాలు విజయవంతంగా కొనసాగడం చాలా అరుదుగా కనిపించే విషయం. ఒక సినిమా బ్లాక్‌బస్టర్ అయినా.. దాని సీక్వెల్ అదే స్థాయిలో ఆకట్టుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా మూడో భాగం వచ్చేసరికి కథలో కొత్తదనం తగ్గిపోవడం, ప్రేక్షకుల్లో ఆసక్తి క్షీణించడం సాధారణంగా జరుగుతుంటుంది. అందుకే చాలా ఫ్రాంఛైజీలు రెండో లేదా మూడో సినిమాతోనే ముగిసిపోతుంటాయి. అయితే మాలీవుడ్‌లో తెరకెక్కిన 'దృశ్యం' ఫ్రాంఛైజీ మాత్రం ఈ ట్రెండ్‌ను పూర్తిగా మార్చేసింది. మొదటి భాగం దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకోగా.. 'దృశ్యం-2' కూడా అద్భుతమైన స్పందన తెచ్చుకుని ఫ్రాంఛైజీ స్థాయిని మరింత పెంచింది. దీంతో మూడో భాగంపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దృశ్యం-3' మాత్రం కంటెంట్ విషయంలో మిశ్రమ స్పందనను ఎదుర్కొంటోంది. సినిమా చూసిన పలువురు ప్రేక్షకులు, సినీ విశ్లేషకులు.. ఈ భాగం 'దృశ్యం', 'దృశ్యం-2' స్థాయిలో లేదని అభిప్రాయ పడుతున్నారు. ముందటి చిత్రాల్లో కనిపించిన ఉత్కంఠభరితమైన కథనం, బలమైన స్క్రీన్‌ప్లే, ఎమోషనల్ కనెక్ట్ ఈసారి అంతగా ప్రభావం చూపం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫ్రాంఛైజీ అభిమానులు ఈ చిత్రాన్ని సిరీస్‌లోనే వీకెస్ట్ ఫిల్మ్‌గా పేర్కొంటున్నారు. కొన్ని కీలక సన్నివేశాలు ఊహించదగ్గ విధంగా ఉండటంతో పాటు కథలో ఆశించిన స్థాయి ట్విస్టులు లేకపోవడం కూడా ప్రేక్షకులను కొంత నిరాశపరిచినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కంటెంట్‌పై మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ.. బాక్సాఫీస్ దగ్గర మాత్రం 'దృశ్యం-3' తన దూకుడు కొనసాగిస్తోంది.

# వరుస ఫ్లాపులతో ఇబ్బందుల్లో పూజా హెగ్డే

**వేద న్యూస్ డెస్క్:**



ఒకప్పుడు దక్షిణాది సినీ పరిశ్రమలోనే కాదు, బాలీవుడ్‌లో కూడా 'లక్కీ హీరోయిన్'గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి పూజా హెగ్డే ప్రస్తుతం వరుస పరాజయాలతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఒక దశలో స్టార్ హీరోలందరి మొదటి ఎంపికగా నిలిచిన ఈ ముంబై భామ, ఇప్పుడు వరుస ఫ్లాప్‌లతో తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టుకునేందుకు పోరాడుతోంది. భారీ అంచనాలతో విడుదలైన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో, పూజా హెగ్డే సినీ ప్రయాణంపై ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మోడలింగ్ రంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకుంది. అందం, గ్లామర్‌తో పాటు అద్భుతమైన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2012లో తమిళ చిత్రం 'మూగమూడి' ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె, ఆ తర్వాత తెలుగులో నాగచైతన్య సరసన 'ఒక లైలా కోసం', వరుణ్ తేజ్‌తో 'ముకుంద' చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రం ఆమె కెరీర్‌కు కీలక మలుపు తిప్పింది. ఆ సినిమా విజయంతో పూజా హెగ్డే టాలీవుడ్‌లో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్‌గా మారిపోయింది. ఆ తర్వాత వరుసగా 'అరవింద సమేత వీర రాఘవ', 'మహర్షి', 'గద్దలకొండ గణేష్', 'అల వైకుంఠపురములో' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా తన స్థానాన్ని మరింత బలపరిచింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర హీరోల సరసన నటిస్తూ పూజా హెగ్డే ఒక దశలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్ల జాబితాలో చేరింది. నిర్మాతలకు లక్కీ హీరోయిన్‌గా, ప్రేక్షకులకు గ్లామర్ క్వీన్‌గా పేరు తెచ్చుకుంది. అయితే 2021 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన 'రాధే శ్యామ్' బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆ తర్వాత చిరంజీవితో నటించిన 'ఆచార్య', విజయ్ సరసన వచ్చిన 'బీస్ట్', బాలీవుడ్‌లో 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్', 'సర్కస్', 'దేవా', 'రెట్రో' చిత్రాలు కూడా వరుసగా విఫలమయ్యాయి. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాలు ఫ్లాప్ కావడంతో పూజా హెగ్డేపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇటీవల తమిళ స్టార్ విజయ్‌తో నటిస్తున్న 'జన నాయకన్' చిత్రం కూడా విడుదల సమస్యల్లో చిక్కుకోవడం ఆమెకు మరో ఎదురుదెబ్బగా మారింది. దీంతో ఒకప్పుడు వరుస హిట్లతో టాప్‌లో నిలిచిన పూజా హెగ్డే ప్రస్తుతం మళ్లీ విజయాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కథల ఎంపికలో చేసిన పొరపాట్లు, బలహీనమైన స్క్రిప్టులు ఆమె కెరీర్‌పై ప్రభావం చూపాయని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పూజా హెగ్డేకు ఇప్పుడు 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రం ఆశాకిరణంగా కనిపిస్తోంది. ప్రముఖ దర్శకుడు డేవిడ్ ధావన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా ద్వారా మళ్లీ బాలీవుడ్‌లో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలని పూజా హెగ్డే ఆశిస్తోంది. జూన్ 5న విడుదల కానున్న ఈ చిత్రంపై ఆమె భారీ అంచనాలు పెట్టుకుంది. సినీ వర్గాల అభిప్రాయం ప్రకారం, ఈ చిత్రం విజయం సాధిస్తే పూజా హెగ్డే కెరీర్‌కు మళ్లీ ఊపిరి పోసినట్టే అవుతుంది. లేదంటే స్టార్ హీరోయిన్‌గా కొనసాగడం మరింత కష్టమవుతుందని చెబుతున్నారు. అయితే గ్లామర్, నటన, డాన్స్‌లో ప్రత్యేక గుర్తింపు కలిగిన పూజా హెగ్డే మళ్లీ పుంజుకునే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు. ప్రస్తుతం ఆమె భవిష్యత్తు పూర్తిగా రాబోయే చిత్రాల ఫలితాలపైనే ఆధారపడి ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రజినీతో అనసూయ ప్రత్యేక క్షణం

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించి, అనంతరం నటిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సూపర్ స్టార్ రజినీకాంత్‌తో కలిసి దిగిన ఫోటోలను ఆమె సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి. "నా జీవితంలో ఎప్పటికీ అభిమానించే వ్యక్తి" అంటూ రజినీకాంత్‌పై తన అభిమానాన్ని వ్యక్తపరుస్తూ అనసూయ చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. బుల్లితెరపై ప్రసారమైన ప్రముఖ కామెడీ కార్యక్రమం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన అనసూయ.. తన అందం, యాంకరింగ్ శైలి, మాటతీరుతో ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. కేవలం యాంకర్‌గా మాత్రమే కాకుండా నటిగా కూడా తన ప్రతిభను నిరూపించుకోవాలని భావించిన ఆమె.. వెండితెరపై వరుస అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రంలో రంగమ్మత్త పాత్రలో కనిపించిన అనసూయ నటనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. అనంతరం పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన చిత్రంలో దాక్షాయణి పాత్రలో నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

# ఓటీటీలోకి క్రైమ్ థ్రిల్లర్ 'రాఖ్'..




**వేద న్యూస్ డెస్క్:**

ఓటీటీ ప్రేక్షకులను ఉత్కంఠభరితమైన కథలతో అలరించేందుకు మరో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిద్ధమైంది. బాలీవుడ్ నటుడు అలీ ఫజల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'రాఖ్' వెబ్‌సిరీస్ ప్రముఖ డిజిటల్ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూన్ 12 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రసారం కానుంది. యథార్థ సంఘటనల స్ఫూర్తితో రూపొందిన ఈ సిరీస్‌లో సస్పెన్స్, థ్రిల్, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు మేకర్స్ వెల్లడించారు. ఇప్పటికే క్రైమ్ థ్రిల్లర్ కథలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ప్రొసిత్ రాయ్ ఈ సిరీస్‌ను తెరకెక్కించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. గతంలో ఆయన రూపొందించిన 'పాతాళ్ లోక్' ప్రేక్షకాదరణ పొందిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో మరింత ఉత్కంఠభరితంగా 'రాఖ్'ను రూపొందించినట్లు సమాచారం. ఈ సిరీస్‌లో అలీ ఫజల్ ఒక కఠిన స్వభావం కలిగిన పోలీస్ అధికారిగా కనిపించనున్నాడు. సమాజంలో కలకలం రేపిన ఇద్దరు టీనేజర్ల అదృశ్య కేసును ఛేదించే బాధ్యత అతనిపై పడుతుంది. కేసు దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ అనేక అనుమానాస్పద సంఘటనలు, దాగి ఉన్న రహస్యాలు వెలుగులోకి వస్తాయి. ప్రతి ఎపిసోడ్‌లో కొత్త మలుపులు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా కథను నిర్మించినట్లు ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది

# 'పెద్ది'పై ట్రోలింగ్, పైరసీకి చెక్.. మేకర్స్ సీరియస్ చర్యలు

**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. సినిమా చుట్టూ సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్, నెగిటివ్ ప్రచారంపై చిత్ర బృందం సీరియస్‌గా స్పందించింది. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవలి కాలంలో స్టార్ హీరోల సినిమాలు విడుదలకు ముందే సోషల్ మీడియాలో నెగిటివ్ ట్రెండ్స్, ఫేక్ హ్యాష్‌ట్యాగ్ క్యాంపెయిన్లు పెరుగుతున్న నేపథ్యంలో.. 'పెద్ది' బృందం ముందుగానే అప్రమత్తమైంది. ముఖ్యంగా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలపై కొన్ని ఫేక్ ఖాతాల ద్వారా సినిమాపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం జరుగుతోందని మేకర్స్ ఆరోపిస్తున్నారు. రామ్ చరణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ, సినిమాపై నెగిటివ్ ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొంటూ నిర్మాతలు సైబర్ క్రైమ్ అధికారులకు అధికారిక ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన మరో వ్యక్తిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు తెలుస్తోంది. కొన్ని సోషల్ మీడియా ఖాతాలు ఒకే తరహా పోస్టులు, ఒకే హ్యాష్‌ట్యాగ్‌లతో సమన్వయంగా ట్రోలింగ్ నిర్వహిస్తున్నాయని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇది కేవలం వ్యక్తిగత స్థాయి ట్రోలింగ్ మాత్రమే కాకుండా.. డబ్బులు తీసుకుని నిర్వహించే వ్యవస్థీకృత నెగిటివ్ క్యాంపెయినా? అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. పెద్ద సినిమాలపై కావాలనే నెగిటివ్ ట్రెండ్స్ సృష్టించడం ద్వారా సోషల్ మీడియాలో విషపూరిత వాతావరణం ఏర్పడుతోందని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా విడుదలకు ముందు సినిమాపై చెడు ప్రచారం చేసి ప్రేక్షకుల్లో అనవసర సందేహాలు సృష్టించే ప్రయత్నాలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. మరోవైపు ట్రోలింగ్‌తో పాటు పైరసీ వ్యవహారాన్ని కూడా 'పెద్ది' మేకర్స్ అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు. సినిమా విడుదలకు ముందే నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించి ప్రత్యేక రక్షణ కోరారు. దీనిపై స్పందించిన కోర్టు 'యాంటీ పైరసీ ఇంజంక్షన్'కు సంబంధించిన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం.. సినిమా విడుదలైన తర్వాత అనుమతి లేకుండా ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, టెలిగ్రామ్ ఛానల్స్, టోరెంట్ సైట్లు, పైరసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రసారం చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం. పైరసీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. 3




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073